## క్లుప్తంగా

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హరితహారం



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం హరితహారం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది సామూహికంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సోమయ్య, అధ్యాపకులు కృష్ణవేణి, గురుపాదం, కరుణాకర్, లక్ష్మణ్, చంద్రయ్య, విమల్‌కుమార్, తిరుమల దేవి, సత్తయ్య, రాజేష్, ఉపేందర్, ప్రవళిక, నరేంద్ర కుమార్, శ్రావణి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అక్రమ పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**కోటపల్లి:** మండలంలోని పుల్లగామ గ్రామ శివారులోని జాయింట్ పట్టాకు సంబంధించిన భూమిని కొంతమంది అక్రమ పట్టా చేసుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బాధితులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పులగామ గ్రామంలోని 11ఎకరాల భూమిని దొంగతనంగా శంకర్, బాపు, అశోక్, రజనీకాంత్ అనే వ్యక్తులు అక్రమంగా పట్టా చేసుకున్నారని దీనికి సంబంధించిన హక్కుదారులు, వాటాదారులు ఉండగా ఎవరికి తెలియకుండానే పట్టా చేసుకున్నట్లు వాపోయారు. అక్రమ పట్టాలు చేసిన అధికారుల పై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఆ పట్టాలను రద్దు చేసి ప్రస్తుతం కబ్జాలో ఎవరైతే ఉన్నారో వారికి న్యాయం చేయాలని కోరారు. రాజారం, శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.

### గ్యాస్ సిలిండర్ లీక్

**లక్సెట్టిపేట:** మండలంలోని ఎల్లారం గ్రామంలో టేకుమట్ల చిన్న సత్తయ్య ఇంటిలో అకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. వృద్ధురాలు రాజవ్వకు గాయాలయ్యాయి. సమీప వ్యక్తులు వెంటనే చల్లార్చడంతో ప్రమాదం తప్పింది. సుమారు రూ.50వేల నష్టం కలిగినట్లు బాధితులు తెలిపారు.

### 'డయల్ యువర్ డీఎం'కు స్పందన

**మంచిర్యాలటౌన్:** ఆర్టీసీ మంచిర్యాల డీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమానికి స్పందన లభించినట్లు డిపో మేనేజర్–1 శ్రీనివాసులు తెలిపారు. బెల్లంపల్లి రూట్‌లో ఏరియా ఆస్పత్రి, మీ సేవా, ఏఎంసీ వద్ద బస్సులు ఆపడం లేదని, చెన్నూరు నుంచి కాళేశ్వరం రూట్‌లో రాంపూర్, లక్ష్మీపూర్ రిక్వెస్ట్ బస్టాప్ వద్ద బస్సులను నిలపడంలేదని పలువురు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల నుంచి చెన్నూరుకు సాయంత్రం 4.30 నుంచి 6గంటల వరకు బస్సులు ఉండడం లేదని, చెన్నూరు నుంచి హైదరాబాద్‌కు ఉదయం 5 గంటలకు ఒక బస్సు వేయాలని పలువురు కోరినట్లు వివరించారు.

### నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

**మందమర్రిరూరల్:** జర్నలిస్టులను కించపరిచే విధంగా వాట్సాప్‌లో పోస్టు చేసిన కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మందమర్రి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళశారం జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్‌పటేల్ మాట్లాడుతూ.. నాయకులపై రాసిన వార్తలు సత్యదూరమైతే ఖండించాలి గాని వ్యక్తిగత దూషణలు సరి కాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. కాగా, టీబీజీకేఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జంగిలి రవీందర్ మాట్లాడుతూ.. అనుచిత పోస్టులు చేసిన కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఆ నాయకున్ని మంత్రి వివేక్‌వెంకటస్వామి పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మేడిపల్లి సంపత్, రాజశేఖర్, అబ్బాస్, బోరిగం వెంకటేష్, తిరుపతిరెడ్డి, సూరిబాబు, సదానందం పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత

**భీమారం:** మంచిర్యాల–చెన్నూర్ జాతీయరహదారిలో పోలంపల్లి మాంతమ్మ దేవాలయం వద్ద బస్టాప్ ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు కొక్కుల నరేష్ మంచిర్యాలలోని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌లుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మెండె మల్లేశ్, తోట శ్రీరాములు, కుర్సిగ సత్యక్క పాల్గొన్నారు.



చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో క్షీరాభిషేకం



భీమారం: క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు



తాండూర్: బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

# 'రైతు భరోసా' సంబురాలు

**భీమారం/తాండూర్/కోటపల్లి/మందమర్రిరూరల్/చెన్నూర్/జన్నారం/జైపూర్/నెన్నెల/దండేపల్లి:** రైతుల ఖాతాల్లో రైతుభరోసా నిధులు విడుదల చేయడంపై జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం సంబురాలు ఘనంగా నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కార్మికశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణసంచాలు కాల్చారు. ర్యాలీలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో తాండూర్‌లో డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, కోటపల్లిలో మండల అధ్యక్షుడు మహేశ్‌తివారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజమల్ల గౌడ్, మందమర్రిలో మండల అధ్యక్షుడు నీలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచందర్, పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, జన్నారంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జైపూర్‌లో కాంగ్రెస్ పార్టీ డీసీసీ జిల్లా జనరల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జన్నారం: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

### పోలీసుల తనిఖీలు



జాగిలంతో తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, ఉత్కూరు చౌరస్తా, పలు ప్రాంతాల్లో పోలీసులు డ్రగ్స్ గుర్తించే నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి రవాణా చేసిన, అమ్మకాలు జరిపినా కేసులు నమోదు చేస్తామని సీఐ రమణమూర్తి హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్‌ను కోల్పోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై గోపతి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర ఆరోగ్య పరీక్షలు

**మంచిర్యాలటౌన్:** మంచిర్యాల పట్టణంలోని సాయికుంట బస్తీ దవాఖాన ఆవరణలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో క్షయవ్యాధి, హెచ్ఐవీ ఎయిడ్స్, మధుమేహం, రక్తపోటు, హెపటైటిస్ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి, అవసరమైన వారికి చికిత్సతో పాటు, మందులు అందించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారిలో 45మందిని ఎక్స్‌రే కోసం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి 102వాహనంలో తరలించారు. అనంతరం క్షయవ్యాధి, హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే క్షయ వ్యాధిగా అనుమానించి, తెమడ పరీక్ష కోసం దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు అమన్, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ రామకృష్ణ, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, హెపటైటిస్ వ్యాధి పర్యవేక్షకులు మధు, సీవో అపర్ణ, వి.స్వప్న పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

# 'స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యం'

**మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి:** స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యం అని పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ పదకొండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దండేపల్లి మండలం మేదరిపేటలో, హాజీపూర్ మండలం రాపల్లిలో మంగళవారం రైతులు, ప్రజలతో కలిసి రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి కేంద్రం ఎంతగానో కృషిచేస్తూ, వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి సైతం అనేక పథకాల ద్వారా నిధులు మంజూరు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు గురువయ్య, ప్రభాకర్, శ్రీనివాస్, సంతోష్, సురేష్, దివ్య, అనిల్, లక్ష్మణ్, మల్లేష్, కిషన్, శ్రీనివాస్, నాయకులు గాజుల ముఖేశ్‌గౌడ్, స్వామిరెడ్డి, గురువయ్య, రమణారావు, బొలిశెట్టి అశ్విన్, శ్రీనివాస్, రాజనర్సు, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునాథ్

# పనులను పరిశీలించిన కేంద్ర బృందం

**భీమారం:** మండలంలోని వివిధ గ్రామాల్లో కేంద్ర జలశక్తి అభియాన్ కేంద్ర మంత్రిత్వశాఖ చేపట్టిన పనులను మంగళవారం కేంద్రబృందం శాస్త్రవేత్త నేతృత్వంలో సభ్యులు పరిశీలించారు. మండలంలోని నర్సింగాపూర్, భీమారం, దాంపూర్, పోలంపల్లి ధర్మారం, కొత్తపల్లిలో నిర్మించిన నీటికుంటలు, ట్రెంచస్, ఇంకుడుగుంతలు పరిశీలించి వాటికి పెట్టిన ఖర్చు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మధుసూధన్, ప్లాంటేషన్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



నీటికుంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

## సమాచారం

**నేడు మంత్రి వివేక్ పర్యటన**

**చెన్నూర్:** చెన్నూర్ నియోజకవర్గంలో మైనింగ్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి బుధవారం పర్యటించనున్నారు. ఉదయం భీమారంలో అదనపు డార్మెటరీ గదుల నిర్మాణం, కస్తూర్బా బాలికల పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌ల అందజేత, జైపూర్ రైతువేదికలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌ల అందజేత, మధ్యాహ్నం మందమర్రి జీఎం కార్యాలయంలో 16మంది డిపెండెంట్‌లకు నియామకపత్రాల అందజేత, సాయంత్రం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్‌ల నిర్మాణాలకు భూమిపూజ, క్యాతన్‌పల్లి ఫ్లై ఓవర్ వద్ద మెట్లను ప్రారంభిస్తారు. ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

**విజయవంతం చేయండి**

**పాతమంచిర్యాల:** ఈ నెల 29, 30తేదీల్లో హన్మకొండలో నిర్వహించే తెలంగాణ ప్రజాఫ్రంట్ 4వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి టి.జైపాల్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కమిటీ సభ్యులు భోగి పోషం, చంద్రయ్య, ఆనంద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**26న మినీ జాబ్‌మేళా**

**పాతమంచిర్యాల:** జిల్లా కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో 26న ఉదయం 10.30గంటలకు మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఐసీ ఆఫ్ ఇండియా మంచిర్యాల శాఖలో మంచిర్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న 100(మహిళా కెరీర్ ఏజెంట్స్–భీమా శక్తి) పోస్టులను భర్తీ చేసేందుకు ఎస్ఎస్‌సీ, ఆపై విద్యార్హత కలిగి, 18 సంవత్సరాల పై వయస్సు గల మహిళా అభ్యర్థులు అర్హులని, ఎంఎన్‌సీ బ్యాంకు కంపెనీలో తెలంగాణ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 60రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఏదేని డిగ్రీ అర్హత కలిగిన 26సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 99128 32330, 80968 57078, 91103 68501 నంబర్లలో సంప్రదించాలన్నారు.

**నియామకం**

**భీమారం:** లంబాడా హక్కులపోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా మంచిర్యాల జిల్లా భీమారం మండలానికి చెందిన జర్పుల రాజ్‌కుమార్ నాయక్‌ని నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్‌నాయక్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ జరిగిన సమావేశంలో లంబాడా హక్కులపై చర్చ జరిగినట్లు తెలిపారు. అనంతరం రాజ్‌కుమార్‌కి నియామాకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అజ్మీరా సుసీలాబాయి, బానోత్ శ్రీనివాస్‌నాయక్ ఉన్నారు.

**జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె**

**బెల్లంపల్లి:** కార్మికవర్గ సమస్యల పరిష్కారం కోసం జూలై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు చల్లూరి దేవదాస్, ప్రభాకర్, కమల్, సుమన్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులు సంపూర్ణంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రాజమౌళి, చంద్రశేఖర్, శివ కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**27న ధర్నా**

**కోటపల్లి:** 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ధర్నా విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనంపల్లి రమేశ్ కోరారు. మంగళవారం దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఉపాధ్యక్షుడు కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సంతోశ్, సతీశ్ పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

**భీమిని:** గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు పక్కాగా చేపట్టాలని డీపీవో వెంకటేశ్వర్ రావు అన్నారు. కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్, జజ్జరవెల్లి, ముత్తపూర్, రెబ్బెన, పోలంపల్లి గ్రామాలను మంగళవారం పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకకుండా, గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చూడాలన్నారు. వాటర్ ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టి, పరిశుభ్రమైన నీటిని అందించాలన్నారు. డ్రెయినేజీల్లో నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### రిజర్వ్‌ఫారెస్ట్ నుంచి ఇసుక తరలిస్తే చర్యలు

**జన్నారం:** రిజర్వ్ ఫారెస్ట్‌లోని వాగుల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే, వారిపై అటవీ చట్టం ప్రకారం కేసులు చేయాల్సి ఉంటుందని మంగళవారం ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు ఇచ్చే టోకెన్ ద్వారా బయట వాగుల నుంచి ఇసుక తీసుకెళ్లవచ్చని సూచించారు. ఎంపీడీవోగాని తహసీల్దార్‌ల టోకెన్ ఉన్న వారు అడవిలోని వాగులకు వెళ్లవద్దని సూచించారు.

# వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాలటౌన్:** జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గూగుల్‌మీట్ ద్వారా జిల్లాలోని వైద్యశాఖ, మున్సిపల్ పంచాయతీరాజ్, ఐసీడీఎస్ అధికారులతో ఆయన మాట్లాడారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలని, మందులు ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్లు ఎస్.అనిత, సుధాకర్‌నాయక్, ప్రసాద్, హరీశ్, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆకస్మిక తనిఖీలు..**

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలంలో కలెక్టర్ కుమార్‌దీపక్ మంగళవారం విస్తృతంగా పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎంపీపీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలు ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం ఆహారం, శుద్ధ నీటిని అందించే ఏర్పాట్లు పరిశీలించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటిస్తూ చదువుల గురించి ఆరా తీసి, భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగేలా లక్ష్యాలు ఏర్పర్చుకోవాలని సూచించారు.



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

**విద్యార్థినిని అభినందించిన కలెక్టర్**

**మంచిర్యాలఅగ్రికల్చర్:** జపాన్ సకురా అంతర్జాతీయ సైన్స్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యార్థిని శ్రీవల్లిని కలెక్టర్ కుమార్ దీపక్, డీఈవో యాదయ్య, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, సైన్స్ అధికారి మధుబాబు మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో అభినందించారు.

# 27న 'చలో కొత్తగూడెం'

**శ్రీరాంపూర్:** తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27న చలో కొత్తగూడెం కార్యక్రమాన్ని చేపట్టినట్లు సింగరేణిలో మారుపేర్ల బాధితులు తెలిపారు. నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాధితులు లక్కి శ్రావణ్‌గౌడ్, వంగ సంతోష్, ఇళ్ల రాజయ్యలు మాట్లాడారు. సింగరేణిలో తమ తండ్రులు చాలా ఏళ్లుగా మారుపేర్లతో పనిచేశారన్నారు. ఈ కారణంగా తమకు కారుణ్య ఉద్యోగాలు రావడంలేదని, విజిలెన్స్ విచారణ పేరుతో వేలాది మంది ఉద్యోగాలకు నోచుకోకుండా ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న చలో కొత్తగూడెం కార్యక్రమం చేపట్టి అక్కడ కంపెనీ ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ధర్నాకు పెద్ద యెత్తున బాధిత కుటుంబాలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాధితులు హరీష్, కొమురమ్మ, వెంకటేశ్, జిల్లాల శ్రావణ్, సంకీర్తన్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మారుపేరు బాధితులు

# ప్రమాదాలు పునరావృతం కావొద్దు

- సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్

**శ్రీరాంపూర్:** ప్రమాదాలు పునరావృతం కావొద్దని కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం సేఫ్టీ రాపిడ్ రెస్పాన్స్ టీం కు సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక టీం ను సిద్ధం చేసుకోవాలన్నారు. ఒక ప్రమాదం జరిగిన తర్వాత ఆ తరహా ప్రమాదం మరొకటి జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, రెస్క్యూ జీఎం శ్రీనివాస్ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం శ్రీనివాస్

**శ్రీరాంపూర్ ఓసీపీలో...**

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఓబీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా జీఎం ఎం శ్రీనివాస్‌లు హాజరై రక్షణ పద్ధతులు వివరించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర్లు, మేనేజర్ శ్రీనివాస్, గని రక్షణాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గుబాయి వార్తలు

### ఓసీపీ పీవోకు సన్మానం

**శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ నూతన ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును టీబీజీకేఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. పీఓ కార్యాలయంలో మంగళవారం ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేష్‌లు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు సత్తయ్య, అన్వేష్ రెడ్డి, గడ్డం మైపాల్‌రెడ్డి, వెంగళ కుమార్ స్వామి, గడ్డం సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించండి

**శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపల్లి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఏరియా వర్క్‌షాప్‌ను మంగళవారం సందర్శించి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు కలవేన శ్యామ్, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, బ్రహ్మచారి, వెంకటేశ్వర్లు, తిరుపతి, రమేశ్ పాల్గొన్నారు.

### జీఎంకు సమ్మె నోటీసు

**శ్రీరాంపూర్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును జీఎం కార్యాలయంలో మంగళవారం శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌కు సీఐటీయూ నాయకులు అందించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ శ్రీనివాస్, పెరక సదానందం, తోడే సుధాకర్, సిరికొండ శ్రీనివాస్, బొజ్జ నవీన్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం



**కాసిపేట:** మండలంలోని దేవాపూర్‌లో మంగళవారం ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించారు. 366మంది రక్తాదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ యూనిట్ హెడ్ బాలగిరిధర్, హెచ్ఆర్ కులకర్ణి, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సెక్రెటరీ మహేందర్ పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు రూ.1.5కోట్ల రుణం మంజూరు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 12పొదుపు సంఘాల గ్రూప్ మహిళలకు భారీగా రుణం మంజూరు అయింది. రూ.1.5కోట్లు రుణం మంజూరు చేస్తూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బెల్లంపల్లి బ్రాంచ్ సానుకూల నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 100రోజుల ప్రణాళికలో భాగంగా రుణ వితరణ చేశారు. బ్యాంకు ఆవరణలో మంగళవారం పొదుపు సంఘాల మహిళలకు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ బుచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు చెక్కును అందజేశారు.



### నోట్‌బుక్స్ పంపిణీ

**భీమారం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు రూ.13వేలతో కొనుగోలు చేసిన నోట్ బుక్స్‌ను మంగళవారం ఎంఈవో గోపాల్‌రావు విద్యార్థులకు అందజేశారు. కాంప్లెక్స్ హెడ్మాస్టర్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## రోడ్డుపై పారుతున్న మురుగునీరు

**భీమారం:** మండలకేంద్రంలోని ఎస్సీకాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డులో డ్రెయినేజీలు దెబ్బతిని, సక్రమంగా లేకపోవడంతో మురుగునీళ్లు రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. ఈ విషయంలో గ్రామపంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని స్థానికులు ఆరోపించారు. రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు డ్రెయినేజీలు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: పల్సాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: విజయ్ ప్రశాంత్ - 9440208447
చెన్నూర్: సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899